విప్ నాయకర్‌ను కలిసిన డిఎస్‌పి

ప్రజాశక్తి - నరసాపురం

విప్, స్థానిక ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్‌ను డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకర్‌కు డిఎస్‌పి శ్రీవేద పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని డిఎస్‌పికి సూచించారు. కార్యక్రమంలో నరసాపురం పట్టణ ఎస్‌ఐలు సిహెచ్.జయలక్ష్మి, ముత్యాలరావు, రూరల్ ఎస్‌ఐ టి.వెంకట సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నాయకర్‌ను కలిసిన డిఎస్‌పి శ్రీవేద

పోరాటాలతోనే.. హక్కుల సాధన

- పోలవరం పునరావాసం పది శాతమే పూర్తి
- ప్రాజెక్టు డిజైన్లు, అంచనాలపైనే పాలకుల దృష్టంతా
- భూమే అన్ని సమస్యలకూ పరిష్కారం
- పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాలతో ప్రత్యేక జిల్లా ప్రకటించాలి
- సిపిఎం ఏలూరు జిల్లా 26వ మహాసభ ప్రారంభం సందర్భంగా బహిరంగ సభలో నేతలు
- తొలిరోజు భారీ ప్రదర్శన, నినాదాలతో దద్దరిల్లిన ఏజెన్సీ పురిటిగడ్డ

బుట్టాయగూడెంలో సిపిఎం ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, బుట్టాయగూడెం

పోరాటాలతోనే హక్కులు సాధించుకోగలమని, లేకపోతే పాలకులు సామాన్య ప్రజలను పట్టించుకునే పరిస్థితి లేదని, కార్పొరేట్ శక్తుల కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని పలువురు నేతలు అన్నారు. మూడు రోజులపాటు జరగనున్న సిపిఎం ఏలూరు 26వ జిల్లా మహాసభలో భాగంగా తొలిరోజు శుక్రవారం మండల కేంద్రమైన బుట్టాయగూడెంలోని కన్నాపురం రోడ్డులో పెట్రోల్ బంకు దగ్గర నుంచి సినిమా హాల్ సెంటర్ వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర భారీ ప్రదర్శన సాగింది. ఈ ప్రదర్శనలో జిల్లా, రాష్ట్ర నాయకులు అగ్రభాగాన నిలిచారు. జిల్లా నలుమూలల నుంచి ప్రతినిధులు, ఏజెన్సీ ప్రాంతం నుంచి పెద్దఎత్తున మహిళలు తరలొచ్చారు. గిరిజన నృత్యాలు, విల్లంబుల ప్రదర్శన, డప్పు వాయిద్యాలు వంటి అనేక కార్యక్రమాలతో అత్యంత ఉత్సాహభరితంగా ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా 'జిందాబాద్ సిపిఎం, వర్ధిల్లాల్లి భూపోరాటాలు, వర్ధిల్లాల్లి ఎర్రజెండా, పోడు భూములకు పట్టాలివ్వాలి, ఎల్‌టిఆర్ భూములకు పట్టాలివ్వాలి, గిరిజనులపై తప్పుడు కేసులు ఆపాలి, 1/70 చట్టం అమలు చేయాలంటూ సిపిఎం కార్యకర్తలు, నాయకులు నినదించారు. మార్గమధ్యంలో అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పూలమాల వేశారు. అనంతరం అక్కడి నుంచి సినిమా హాల్ సెంటర్ వరకు ప్రదర్శన సాగింది. సినిమా హాల్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు పెద్దసంఖ్యలో జనం చేరుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం, జిల్లా నాయకులు పాల్గొన్నారు. ముందుగా ఎ.రవి అధ్యక్షోపన్యాసం ఇచ్చారు. ఆదివాసీల పురిటిగడ్డ బుట్టాయగూడెంలో మొదటిసారిగా సిపిఎం జిల్లా మహాసభ జరుగుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై సిపిఎంకు ఎటువంటి అభ్యంతరమూ లేదని, మునిగిపోతున్న లక్ష కుటుంబాల మాటేంటని ప్రశ్నించారు. పునరావాసం కల్పించాకే ప్రాజెక్టు నిర్మాణం జరగాలని చట్టాలు చెబుతున్నాయన్నారు. ఇప్పటి వరకూ పది శాతమే పునరావాసం జరిగిందని, మిగిలిన 90 శాతం పరిస్థితి ఏమిటో చెప్పడం లేదన్నారు. పునరావాస ప్యాకేజీ లేదు, 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీ లేదు, పోడు భూములకు పరిహారం లేదని అన్నారు. మూడేళ్లుగా ఎన్నో కీలక పోరాటాలు సాగాయన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వాన 'పోలవరం పోరుకేక' పాదయాత్ర విజయవాడ వరకు సాగిందన్నారు. 1/70 చట్టం, పీసా చట్టం అమలు చేయాలన్నారు. ప్రస్తుత ఎంఎల్‌ఎ గిరిజనులకు వ్యతిరేకంగా మాట్లాడటం బాధాకరమన్నారు. ఎల్‌టిఆర్ భూములపై పోరాడుతున్న గిరిజనులపై కేసులు పెడుతున్నారన్నారు. జిల్లాలో 5.75 లక్షల ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, పేదలకు పంపిణీ చేయాలన్నారు. ఎర్రకాలువ భూములు, పంగిడిగూడెం సీలింగ్ భూములు, టి.నరసాపురంలో సైతం పెద్దఎత్తున భూములు భూస్వాముల చేతిలో ఉన్నాయన్నారు. స్కీమ్ వర్కర్లు, భాషా వాలంటీర్లకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కరెంట్ ఛార్జీలు భారీగా పెరిగిపోయాయన్నారు.

భూమితోనే అన్ని సమస్యలకూ పరిష్కారం

ముఖ్య అతిథులు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యుల గురించి ఆలోచించడం లేదని, కార్పొరేట్లకే సహజ వనరులతోసహా దోచిపెడుతున్నారని అన్నారు. కేరళలో రూ.700 కూలి ఉందని, ఇంకా ఎక్కడైనా అమల్లో ఉందా అని ప్రశ్నించారు. ఆడపిల్లలకు రక్షణ లేదన్నారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించినా ప్రధాని నోరు మెదపలేదన్నారు. 85 శాతం ఎంపీలు వందల, వేల కోట్ల ఆస్తిపరులన్నారు. మోడీ రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని, పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు అమలు చేస్తున్నారని అన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేశారని, గంగవరం పోర్టు అదానీకి కట్టబెట్టారన్నారు. త్వరలో పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాలను కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలని పెద్దఎత్తున పోరాటం చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్లు ఆదివాసీలను పట్టించుకోవడం లేదని, ఏజెన్సీ ప్రాంతం కొత్త జిల్లాగా ఏర్పాటైతేనే సమస్యలకు పరిష్కారం ఉంటుందని అన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో భూపోరాటాలతో పది వేలకుపైగా ఎకరాలను స్వాధీనం చేసుకున్నామని, ఇంకా దాదాపు 50 వేల ఎకరాలు గిరిజనేతరుల చేతుల్లోనే ఉందని అన్నారు. జీలుగుమిల్లిలో ఆయుధ కర్మాగారం పెడితే ప్రభుత్వం సంగతి తేలుస్తామని హెచ్చరించారు. ఎంఎల్‌ఎ గిరిజన హక్కులను కాలరాసి గిరిజనేతరులకు వత్తాసు పలుకుతున్నారన్నారు. పోడు భూములకు టిడిపి అయినా, వైసిపి అయినా పట్టాలివ్వరని, పట్టాల కోసం ఉద్యమాలు సాగించాలన్నారు. ఏజెన్సీలో స్పెషల్ డిఎస్‌సి, భాషా వాలంటీర్ల సమస్యలతోపాటు భూపోరాటాలు సాగించాలని యువతకు పిలుపునిచ్చారు. పోరాటాలు సాగితే భూమి పట్టా అన్నీ వస్తాయన్నారు. భూమితోనే చదువు, ఇల్లు అన్నీ వస్తాయన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మొడియం నాగమణి మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఇక్కడ భూ పోరాటాలు సజీవంగా ఉన్నాయన్నారు. ఐటిడిఎ, తహశీల్దార్ కార్యాలయాలు గిరిజనుల కోసం పని చేయడం లేదన్నారు. ఎర్రజెండా పోరాటాలతోనే భూములు సాధించుకున్నామని తెలిపారు. గిరిజనులకు అండగా ఎర్రజెండా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, జి.రాజు, తెల్లం రామకృష్ణ, నాయకులు తెల్లం దుర్గారావు, కారం భాస్కరరావు, ఎం.జీవరత్నం, ధర్మల రమేష్, ఎం.సుధారాణి, వి.శ్రీను, నాగేంద్రరావు, అందుగుల ఫ్రాన్సిస్, జి.వెంకట్రావు, పి.సూర్యారావు, రాంబాబు, రామముత్యాలమ్మ, కృష్ణారావు, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభ రెండో రోజు శనివారం ప్రతినిధుల సభ ప్రారంభం కానుంది. శని, ఆదివారాల్లో సాగే ఈ సభలో జిల్లాలోని సమస్యలపై చర్చించడంతోపాటు పలు తీర్మానాలను చేయనున్నారు. అనంతరం నూతన జిల్లా కమిటీని మహాసభ ఎన్నుకోనుంది.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

తొలిరోజు 1,658 అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి - భీమవరం

భూసమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక రెవెన్యూ సదస్సులని, జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి ప్రారంభమైన సదస్సులను వినియోగించుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వారం రోజులు ఆలస్యంగా సదస్సులు ప్రారంభించామన్నారు. ఈ సదస్సులు వచ్చే జనవరి ఎనిమిదో తేదీ వరకూ సాగుతాయని తెలిపారు. జిల్లాలోని 318 రెవెన్యూ గ్రామాల్లో తొలి రోజు 24 గ్రామాల్లో సభలు నిర్వహించగా 1,658 అర్జీలను స్వీకరించారన్నారు. ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నూటికి 50 శాతం అర్జీలు భూవివాదాలు, రెవెన్యూ అంశాలకు సంబంధించిన దరఖాస్తులే ఉంటున్నాయన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన భూసమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ప్రతి గ్రామంలోనూ ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. రెవెన్యూ, భూసమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక రెవెన్యూ సదస్సులు నిలుస్తాయని, రెవెన్యూ, రీసర్వే విషయాలకు సంబంధించిన సమస్యలు మాత్రమే ఈ సదస్సులో చర్చించి, పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

రైతులను మోసగించిన కూటమి ప్రభుత్వం

అన్నదాతకు అండగా వైసిపి కార్యక్రమంలో నేతల విమర్శ

విస్సాకోడేరు వంతెన వద్ద నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ

డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేస్తున్న వైసిపి మాజీ మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు

ప్రజాశక్తి - భీమవరం

రైతాంగానికి కనీస మద్దతు ధర ఇవ్వకుండా రైతులను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైసిపి నేతలు విమర్శించారు. ఆరు నెలల కూటమి పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. సామాన్య ప్రజానీకాన్ని సైతం అన్ని విధాలా నట్టేట ముంచిందని రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. భీమవరంలో అన్నదాతకు అండగా వైసిపి కార్యక్రమం గురువారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వైసిపి మాజీ మంత్రులు, మాజీ ఎంఎల్‌ఎలు, పార్లమెంటు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, వైసిపి నేతలు, నాయకులు కార్యకర్తలు తరలివచ్చారు. విసాకోడేరు వంతెన వద్ద నుంచి భీమవరం కలెక్టరేట్ వరకు రైతుల సమస్యలు పరిష్కరించాలని భారీ నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ మాట్లాడారు. రైతులకు నష్టం జరిగితే విత్తనాలు, ఎరువులు సబ్సిడీ ద్వారా వైసిపి ప్రభుత్వం అందించిందన్నారు. 2014లో రైతు రుణమాఫీ చేస్తానని చంద్రబాబు మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు పెట్టుబడి సహాయం అందిస్తానని చెప్పి ఇప్పుడు ప్రభుత్వం రిక్తహస్తం చూపుతోందన్నారు. ఎంఎల్‌సిలు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ ప్రసంగించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడూరి ఉమాబాల, గూడాల గోపి, పివిఎల్ నరసింహరాజు, వేండ్ర వెంకటస్వామి, పేరిచర్ల విజయ నర్సింహరాజు, కామన నాగేశ్వరరావు, కోడే యుగంధర్, పేరిచర్ల సత్యనారాయణ రాజు, చినమిల్లి వెంకట్రాయుడు, వాసర్ల ముత్యాలరావు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు ఉపసంహరించుకోవాలని నిరసనలు

తాడేపల్లిగూడెంలో..

ప్రజాశక్తి - ఆచంట

పెంచిన విద్యుత్ భారాలను తక్షణం ఉపసంహరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ప్రజలపై విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లును దహనం చేశారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ ప్రజా నిరసనను పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ భారం ప్రజలపై వేయబోమని చెప్పి ఇప్పుడు విద్యుత్ ఛార్జీలు పెంచడం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని ఎన్నికల ముందు చెప్పిన టిడిపి ఇప్పుడు ఆ మీటర్లు ఏర్పాటుకు పూనుకోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్ రావు, నేతలు కుసుమే జయరాజు, తలుపూరి బుల్లబ్బాయి, బండి రంగారావు, చదలవాడ చంటిబాబు, తోటపల్లి సత్యనారాయణ, ఎస్‌విఎన్.శర్మ పాల్గొన్నారు.

ఆకివీడులో..

తాడేపల్లిగూడెం: స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీసు ఐల్యాండ్ వద్ద కరెంట్ బిల్లులు దహనం చేపట్టారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వం కరెంటు ఛార్జీలు విపరీతంగా పెంచిందన్నారు. అదానీతో గత ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటే కూటమి ప్రభుత్వం రద్దు చేయాల్సిందిపోయి అదే ఒప్పందాన్ని అమలు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషు, పోతు శ్రీను, పెనుగంటి దుర్గ, కన్నంరెడ్డి శివాజీ, యడవల్లి వెంకట దుర్గారావు, మాదాసు రాజు, దత్తు రాము, అన్నం చిన్నారావు పాల్గొన్నారు.

యలమంచిలి: విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా బాడవ గ్రామంలో సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు దేవ సుధాకర్ మాట్లాడుతూ అదనపు ఛార్జీల విషయంలో పునరాలోచించి పేదలపై భారం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆచంటలో..

ఆకివీడు: విద్యుత్ భారాలను నిరసిస్తూ స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యాన విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం ఏరియా కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడుతూ కూటమి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు పెంకి అప్పారావు, బివి.వర్మ, బి.కళ్యాణి, గేదెల ధనుష్, గోపిశెట్టి రాంబాబు, షేక్ బాజీ, గేదెల రాము, పంపన రమణ, నెల్లి సూరిబాబు, సత్యనారాయణ, భాస్కరరావు పాల్గొన్నారు.

పెనుమంట్ర: విద్యుత్ భారాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. మండల కార్యదర్శి కె.ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు కె.సుబ్బరాజు, కె.వెంకటేశ్వరరావు, మంగం సూర్యనారాయణ, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పెంటపాడు: విద్యుత్ భారాలను ఉపసంహరించాలని కోరుతూ స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యాన కరెంటు బిల్లులను శుక్రవారం దహనం చేశారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, నేతలు బంకురు నాగేశ్వరరావు, చిర్ల పుల్లారెడ్డి, పోతు శ్రీను మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు తగ్గిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ఇచ్చి దానికి భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో దూలం ప్రసాద్, పెనగంటి దుర్గ, దత్తు రాము, గంట కోటి, సిద్దిరెడ్డి శేషు, నారపరెడ్డి కొండలరావు, యడవల్లి వెంకన్న, పతివాడ నాగేంద్ర, మాదాస్ రాజు, బర్ల బాలాజీ, తెర్లి రాజేష్, శివాజీ, మణికంఠ, బాలాజీ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

సిజిఆర్‌ఎఫ్ ద్వారా సమస్యలు పరిష్కారం

వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం ఛైర్మన్ సత్యనారాయణ

ప్రజాశక్తి - నరసాపురం

ఒక్క రూపాయి ఖర్చు లేకుండా విద్యుత్ వినియోగదారులు సిజిఆర్‌ఎఫ్ (విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం) ద్వారా విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఇపిడిసిఎల్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం ఛైర్మన్ బి.సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని విద్యుత్ శాఖ ఇఇ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే సిజిఆర్‌ఎఫ్ ప్రధాన లక్ష్యమన్నారు. ఆన్‌లైన్, ఉత్తరం, వాట్సప్, ఫోన్, మెయిల్ ద్వారా వినియోగదారులు తమ సమస్యలను సిజిఆర్‌ఎస్ దృష్టికి తీసుకురావొచ్చన్నారు. పరిశీలించి ఫిర్యాదును రిజిస్టర్ చేస్తామన్నారు. రెండు లేదా వారం లేదా ఆరు నెలల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఇప్పటివరకూ రూ.14,26,650 నష్టపరిహారం అందించామన్నారు. మరికొన్ని కేసుల్లో అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశామన్నారు. విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలు తెలియజేసేందుకు 1912 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకూ 8,264 కేసులు నమోదైతే 8,204 కేసులు పరిష్కరించామన్నారు. విద్యుత్ వినియోగదారులను చైతన్యపర్చేందుకు అవగాహన కార్యక్రమాలు, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఆలస్యం చేస్తే 18 శాతం వడ్డీతో సంస్థ చెల్లించాల్సి ఉంటుందన్నారు. పశువులు చనిపోయినా పరిహారం ఇవ్వాల్సిందేన్నారు. అనంతరం ఆయన వినియోగదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కమిటీ ఛైర్మన్ బి.సత్యనారాయణను, ఎస్‌ఇ ఆలపాటి రఘునాథ బాబు, ఇఇ కె.మధుకుమార్ పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు షేక్ బాబర్, ఎం.మణి, నరసాపురం ఎడిఇ ఓంకార్, ఎఇ ప్రభాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

డిఇ తీరుతో ముందస్తు తీర్మానాలు

ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని

ప్రజాశక్తి - వీరవాసరం

పంచాయతీరాజ్ డిఇ గుద్దటి స్వామినాయుడు తీరుతో మండల పరిషత్ సమావేశంలో ముందస్తు తీర్మానాలు తీసుకోవాల్సి వస్తుందని ఎంపిపి వీరవల్లి దర్గాభవాని అన్నారు. వీరవాసరం మండల పరిషత్ అత్యవసర సమావేశం శుక్రవారం ఎంపిడిఒ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపిపి దుర్గాభవాని అధ్యక్షతన జరిగింది. ఎంపిటిసిలు, సర్పంచులు మాత్రమే పాల్గొన్న ఈ సమావేశంలో ఆసక్తికర చర్చ సాగింది. 38 పనులకు సమావేశం ఆమోదం పొందిన తర్వాత సభ్యులు అంగికరిస్తే మరికొన్ని పనులకు ముందస్తు ఆమోదం తెలపాల్సిన అవసరం ఉందని ఎంపిపి కారణాలు వివరించారు. పంచాయతీరాజ్ డిఇ తన ఇష్టానుసారంగా మండల పరిషత్ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురాకుండా మండలవ్యాప్తంగా కొన్ని పనులకు ప్రతిపాదనలు రూపొందించి పూర్తి చేస్తున్నారన్నారు. ఈ కారణాల రీత్యా కొన్ని పనులపై ముందస్తు తీర్మానాలు చేసి అవే పనుల జాబితా మన వద్ద, మరో జాబితా ఎంఎల్‌ఎ వద్ద ఉంచి ఈ జాబితాలో పనులు కాకుండా డిఇ వేరే పనులు ప్రతిపాదించకుండా చూడాలన్నదే ముందస్తు తీర్మానాల ఉద్దేశమని చెప్పారు. దీనికి సభ్యులు అంగీకారం తెలిపారు. ఇదిలా ఉంటే తమకు ఒక్కొక్క పని మాత్రమే కేటాయించి, అధికార పార్టీ ఎంపిటిసిలకు ఎక్కువ సంఖ్యలో పనులు కేటాయించడం పట్ల వైసిపి ఎంపిటిసిలు వీరవల్లి ఉషారాణి, బోను జ్యోత్స్నదేవి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై అధికార పార్టీ సభ్యులు స్పందిస్తూ వైసిపి పాలనలో మండల పరిషత్ పాలనకు అడుగడుగునా అడ్డు తగిలారన్నారు. వీరవాసరం గ్రామానికి సుమారు రూ.30 లక్షలు నిధులు కేటాయిస్తే వైసిపి సర్పంచి చికిలే మంగతాయారు పంచాయతీ తీర్మానం ఇవ్వనప్పుడు మీరేం చేశారంటూ ఎదురుదాడికి దిగారు. దీంతో కొద్దిసేపు నేతల మధ్య వాదోపవాదాలు సాగాయి. మత్స్యపురి సర్పంచి కారిపెల్లి శాంతిప్రియ, ఎంపిటిసి గోడి ఆదిలక్ష్మీ మాట్లాడుతూ తాము దళిత శ్మశానంలో ప్రతిపాదించిన పనులు కాకుండా వేరే వ్యక్తులు ప్రతిపాదించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దళిత ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వనప్పుడు ఈ రిజర్వేషన్లు ఎందుకని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపిపి స్పందిస్తూ తప్పనిసరిగా దళిత ప్రజాప్రతినిధులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అనంతరం ఎంపిడిఒ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయడంలో ఉన్న నిబంధనలు సభ్యులకు వివరించారు. సమావేశంలో వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ఎంపిటిసిలు కొల్లేపర శ్రీనివాసరావు, అంగర కుటుంబరావు, ఇందిర, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ మస్తాన్, సర్పంచులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, గూడూరి ఓంకారం, సైదు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమావేశంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న దళిత ప్రతినిధులు

కార్పొరేటర్ వ్యాఖ్యలపై సచివాలయ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఆచంట

జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో చేసిన కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సచివాలయ ఉద్యోగులు శుక్రవారం సాయంత్రం ఎంపిడిఒ కార్యాలయం గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. సచివాలయ ఉద్యోగులకు ఏం పనిలేదని, ఖాళీగా ఉంటున్నారని ఆయన అనడంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ వెంటనే ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రోజంతా తమతో కలిసి విధి నిర్వహణలో పాల్గొంటే తాము ఏం చేస్తున్నామో తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఉండి నియోజకవర్గాన్ని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం

అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - కాళ్ల

ఎపిలో ఉండి నియోజకవర్గాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణంరాజు అన్నారు. మండలంలోని కోపల్లె, గాంధీనగరం, మాలవానితిప్ప, కలవపూడి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి దాతలు, గ్రామస్తులు సహకరించాలన్నారు. కోపల్లెలో రూ.12 లక్షల మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. గాంధీనగర్ గ్రామంలో జల జీవన మిషన్ నిధులు రూ.5.70 లక్షలు, పలువురు దాతలు ఇచ్చిన రూ.11 లక్షల విరాళాలతో నిర్మించిన తాగునీటి ట్యాంక్ ప్రారంభోత్సవం, మాలవానితిప్ప గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన వంతెన ప్రారంభోత్సవం, ఎస్‌సి బోస్ కాలనీలో దాతల సహకారంతో నిర్మించిన బస్సు షెల్టర్, కలవపూడిలో దాతల సహకారంతో రూ.46 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పలు గ్రామాల గ్రామ సర్పంచులు సాగిరాజు సుబ్బరాజు, బూడి నాగమణి, గేదల జాన్, మంతెన శ్రీనివాసరాజు, జనసేన నాయకులు ముత్యాలరత్నం జుత్తిగ నాగరాజు, ఎరుబండి రామాంజనేయులు, దాతలు మంతెన పెద నరసింహమూర్తి రాజు, కంతేటి శ్రీనివాసరాజు, మంతెన శివాజీ రాజు, మంతెన చిన నరసింహరాజు, సాగిరాజు సోమరాజు, దంతులూరి శ్రీనివాసరాజు, బూడి పర్రాలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కలవపూడి గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకష్ణరాజు

సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 18వ వార్డులోని 9వ సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ అంజయ్య శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. 9వ సచివాలయం తనిఖీ నిమిత్తం సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల అటెండెన్స్ రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పాలకొల్లు ప్రయివేటు స్కూల్ ఎపిపియుఎస్ఎంఎ ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించామని ఎపిపియుఎస్ఎంఎ సెక్రటరీ శ్రీరామ్ తెలిపారు. ఈ పోటీల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో 23 రన్ వల్ల మరింత అవగాహన పెంపొందించేందుకు కృషి చేస్తామని ప్రెసిడెంట్ షాజహాన్ తెలిపారు. ట్రెజరర్ భానుప్రకాశ్ ఈ పోటీల దిగ్విజయంగా జరగడానికి సహకరించిన జోన్‌లోని అన్ని స్కూళ్లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలను ఎపిపియుఎస్ఎంఎ నాయకులు రావూరి అప్పారావు, జానకీరామ్, దుర్గారావు, సాయిబాబా, సుబ్బారావు అభినందనలు తెలిపారు.

ఆంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - వీరవాసరం

నందమూరి గరువు ఆంజనేయ స్వామి ఉత్సవాలను ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) శుక్రవారం ప్రారంభించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో పౌరాణిక నాటకాలు, సినీ మ్యూజికల్ కచేరీలు ప్రదర్శించనున్నారు. ఈ నెల 25వ తేదీ వరకూ సాగే ఉత్సవాలు ఆఖరి రోజు అన్న సంతర్పణతో ముగుస్తాయి. ఉత్సవాల సందర్భంగా స్వామివారిని వివిధ కళా బృందాలతో ఊరేగింపుగా నందమూరి గరువు నుంచి వీరవాసరం మీదుగా శృంగవృక్షం వరకూ ఊరేగించారు.

పశువైద్యశాలలో వైద్యుడి పోస్టు భర్తీ చేయాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

వేల్పూరు పశు వైద్యశాలలో ఖాళీగా ఉన్న పశు వైద్యుడి పోస్టును తక్షణం భర్తీ చేయాలని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో తణుకు డిప్యూటీ తహశీల్దార్ ఎన్.శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల్పూరు చుట్టుపక్కల ఉన్న కొమరవరం, ఎర్రాయచెరువు, మహాలక్ష్మి చెరువు, వీరభద్రపురం గ్రామాలకు సంబంధించి దాదాపు 500 మందికిపైగా రైతులకు చెందిన పశువులకు ఈ ఆసుపత్రి ద్వారా వైద్య సేవలందించాల్సి ఉందన్నారు. అంతటి ప్రాధాన్యత కలిగిన పశు వైద్యశాలకు దాదాపు 8 నెలలుగా పశువైద్యుడు లేకపోవడంతో రైతులు, పశువుల పెంపకం దారులు ఇబ్బందిపడుతున్నారన్నారు. పశువులకు అవసరమైన వైద్య సేవలందక మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పశు వైద్యశాలలో రెగ్యులర్ పశు వైద్యుడిని, డిప్యూటీ అసిస్టెంట్ పోస్టులను తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యండమూరి నాగేంద్ర పాల్గొన్నారు.

పిఎంపిలకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గణపవరం

ప్లాస్టిక్ సర్జన్‌పై శుక్రవారం మండల పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో పిఎంపి డాక్టర్లకు అవగాహన కల్పించారు. మండల పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో సరిపల్లి సాయిబాబా మందిరంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు మండల అధ్యక్షులు ఎం.సత్యనారాయణ మూర్తి అధ్యక్షత వహించారు. సదస్సులో పాల్గొన్న ఏలూరు ఆశ్రం హాస్పటలకు చెందిన సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కాలిన గాయాలకు సర్జరీ చేయొచ్చని తెలిపారు. డాక్టర్ కృష్ణచరణ్ మాట్లాడుతూ గ్యాస్ట్రిక్ అండ్ పాంక్రియా ట్రైటిస్ అలాగే గ్యాస్ట్రిక్ సర్జరీపై సభ్యులకు అవగాహన కల్పించారు. సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు జయసూర్య మాట్లాడుతూ పిఎంపిలు పరిమితి మించి వైద్యం చేయరాదని సూచించారు. జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెల 27న జరిగే పిఎంపి ఆవిర్భావ దినోత్సవానికి మండలంలో సభ్యులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కొటికల అప్పారావు, మండల కార్యదర్శి వి.శివ శ్రీనివాస్‌రావు, ఇతర సభ్యులు మస్తాన్‌వలీ పాల్గొన్నారు.

మండలాన్ని అగ్రభాగాన నిలపాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేసి మండలాన్ని అగ్రభాగాన నిలపాలని ఎంపిడిఒ ఆర్.లోహిత్ జయసూర్య పిలుపునిచ్చారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శుక్రవారం నిర్వహించిన రెండో రోజు శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. సుస్థిర అభివృద్ధి దిశగా పది 17 లక్ష్యాలు 9 థీమ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ థీమ్స్ గ్రామ పంచాయతీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి పివివిఎస్.రామ్ ప్రసాద్, ఎఒ వి.శ్యామ్ చంద్రరావు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : సుస్థిర లక్ష్యాలతో గ్రామ అభివృద్ధి అని ఎంపిడిఒ ఎన్ఎస్ ఉమా మహేశ్వరరావు తెలిపారు. పాలకొల్లు ఎంపిడిఒ కార్యాలయం వద్ద సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం నేటితో ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ విస్తరణ అధికారి గుడాల హరిబాబు, ఎంఇఒ వీరస్వామి, శర్మ, ఎఇ ఆర్‌డబ్ల్యుఎస్ సురేష్, పిఎంఎ ఆచారి పాల్గొన్నారు.

ఉండి : గ్రామాల్లో పేదరికాన్ని నిర్మూలించడమే సుస్థిర అభివృద్ధి లక్ష్యమని మండల అభివృద్ధి అధికారి ఎస్.రవీంద్ర అన్నారు. శుక్రవారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రామాల్లోని పేదరికం నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్‌గా ఎంపిడిఒ ఎస్.రవీంద్ర, కో డైరెక్టర్‌గా మండల విస్తరణ అధికారి సిహెచ్ వెంకటరెడ్డి వ్యవహరించారు.

జర్నలిస్టులపై దాడులు ఆపాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

జర్నలిస్టులపై జరిగిన దాడులను నిరసిస్తూ ఏపియా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ డివివిఎస్.ఎల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొడమంచిలి కృష్ణ, టి.దొరబాబు, భాస్కర్, బి.బుచ్చిబాబు, పి.శివ, శ్రీను, ప్రవీణ్, కుమార్, సత్య, వెంకటేశ్వరరావు, సతీష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణ హోటళ్లలో నిబంధనలు అతిక్రమిస్తే యజమానులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో హోటల్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హోటళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు జారీచేశారు. నాసిరకం ఆహార పదార్థాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను విక్రయిస్తే హోటల్ యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. త్వరలో పట్టణంలోని అన్ని హోటళ్లను తనిఖీ చేస్తామన్నారు. వంట మాస్టర్లకు తప్పనిసరిగా ఆరు నెలలకోసారి మెడికల్ టెస్ట్‌లు చేయించాలని సూచించారు.

మాట్లాడుతున్న కమిషనర్ ఏసుబాబు

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రోడ్డెక్కిన ధాన్యం..!

ఆరబెట్టుకుంటున్న రైతులు

రోడ్డుపై ధాన్యం ఆరబెడుతున్న రైతులు

ప్రజాశక్తి - ఆచంట

ఖరీఫ్ మాసూళ్లు ప్రారంభమై పది రోజులు కావస్తోంది. ఈ తరహాలో రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు ఆర్అండ్‌బి ప్రధాన రహదారులను కల్లాలుగా వినియోగిస్తున్నారు. ఐదేండ్ల కురిసిన వర్షాలకు వరి పంట నాలుగు రోజులు ఆలస్యం కావడంతో యంత్రాలతో మాసూలు చేయించి నేరుగా ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్నారు. మండలంలోని ఆచంట, కొడమంచిలి, కోడేరు, కరుగోరుమిల్లి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం గ్రామాల్లో ముమ్మరంగా వరి కోతలు సాగుతున్నాయి. చేలన్నీ బురదగా ఉండడంతో రైతులు రోడ్లనే కల్లాలుగా మార్చుకుని పండించిన ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ఒక వేళ వర్షం వచ్చినా ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవడానికి అనువుగా ఉంటుందని, పంటను ఆరబెట్టడానికి రోడ్డు నుంచి వచ్చే వేడి కూడా అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ తరహాలో మార్టేరు నుంచి ఆచంట వయా కోడేరు వరకూ ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనుల్లో రైతుల నిమగ్నమయ్యారు. దీనివల్ల వాహనదారులు ఇబ్బందులు పడినా రైతుల కష్టాన్ని చూసి వారికి అనుగుణంగానే వెళ్లడంతో రైతులు ఆనందిస్తున్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో ఎపి మత్స్య విశ్వవిద్యాలయం - మత్స్య కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల (డ్రగ్స్)పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అలవాటు వల్ల భవిష్యత్ నాశనమవుతుందన్నారు. మాదకద్రవ్యాల నివారణకు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. యువత దేశానికి పట్టుకొమ్మలని తెలిపారు. ఒక్కసారి మాదకద్రవ్యాలకు అలవాటుపడిన తర్వాత జీవనశైలి మారిపోయి, వారు

మాట్లాడుతున్న సిఐ దుర్గాప్రసాద్

నిర్వర్తించాల్సిన బాధ్యతలను మర్చిపోతారని, మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో గొప్పవాళ్లను చేయాలనే ఆశతో ఉంటే కొంత మంది యువత డ్రగ్స్‌కు అలవాటుపడుతున్నారన్నారు. రూరల్ ఎస్ఐ టి.వెంకటసురేష్ మాట్లాడుతూ విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు అనుమానం వచ్చినా, విక్రయిస్తున్నట్లు తెలిసినా పోలీసులకు సమాచారం అందించాలని, అప్పుడు మాత్రమే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థులందరూ తోటి విద్యార్థులతో సోదరభావంతో మెలగాలని, సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని తెలిపారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ టి.నీరజ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.వీరభద్రరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్రావణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ నాటిక పోటీలు

ప్రజాశక్తి - వీరవాసరం

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో తోలేరులో నిర్వహించిన జాతీయ స్థాయి నాటిక పోటీలు గురువారం రాత్రితో ముగిశాయి. మాజీ జెడ్‌పిటిసి పోలిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు. మోషేనురాజు మాట్లాడుతూ ఆధునిక యుగంలో భారతీయ సంప్రదాయ, సాంస్కృతిక కళలైన జానపద, స్టేజీ నాటికలు, కోలాటం, పౌరాణిక నాటకాలు ఉనికిని కాపాడుతున్న కళాపరిషత్ నిర్వాహకులు అభినందనీయులన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు, వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మళ్ల తులసీ రాంబాబు, పోకల జ్యోతి, ఆరాధ్యుల కోటేశ్వరరావు, చవాకుల సూర్య నరేష్‌బాబు, వీఎంజెడ్.శ్యాంప్రసాద్, అడబాల లక్ష్మీనారాయణను మండల చైర్మన్ చేతుల మీదుగా సత్కరించారు. అనంతరం ఉత్తమ నాటికలకు, నటులకు బహుమతుల ప్రదానం చేశారు. ఉత్తమ నాటిక నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత, ద్వితీయ ఉత్తమ నాటిక ఇంద్రప్రస్థం, తృతీయ ఉత్తమ నాటిక అహల్యాంగ ఎంపిక చేశారు. ఉత్తమ దర్శకుడు చలసాని కృష్ణప్రసాద్, ఉత్తమ నటుడు



సమాజ సేవకుడు రాంబాబును సత్కరిస్తున్న కళాపరిషత్

పి.వరప్రసాద్, ఉత్తమ నటి జ్యోతిరాణి, ఉత్తమ విలన్ నడింపల్లి వెంకటేశ్వరావు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో చవాకుల సత్యనారాయణ, జవ్వాది దాశరథి శ్రీనివాస్, కొప్పిసెట్టి గోపాలకృష్ణ, లింగం సత్యనారాయణ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

రైతులు రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్ అన్నారు. శుక్రవారం వెంకటరాజపురం పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సదస్సుకు గ్రామ సర్పంచి మలంపల్లి సురేష్ అధ్యక్షత వహించారు. భాస్కర్ మాట్లాడుతూ రైతుల పొలాల సమస్యలుంటే సదస్సులో పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపి, వీఆర్వో డిటి విజయరత్నం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరంలో మాట్లాడుతున్న గ్రామ పీడీ అప్పారావు

పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి భూపతిరాజు వంశీకృష్ణంరాజు అధ్యక్షత రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ భూములకు సంబంధించిన సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. సర్పంచి వంశీకృష్ణంరాజు మాట్లాడుతూ భూముల సంబంధించిన సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్ఓ, సర్వేయర్ పాల్గొన్నారు.

నరసాపురం : పెండింగ్ భూములకు సంబంధించి సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు చక్కటి వేదికని తహశీల్దార్ రాజరాజేశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్త, పాత నవరసపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ఆమె ప్రారంభించారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ అడంగల్, పట్టాదారు పుస్తకం, పేర్లలో మార్పులు తదితర సమస్యలను సదస్సులో పరిష్కరించుకోవచ్చన్నారు. సర్పంచి జ్యోతి, మాజీ సర్పంచి చిట్టి మోషే, వీఆర్ఓ సత్తిబాబులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కృష్ణయ్యపాలెంలో శుక్రవారం సర్పంచి బేతపూడి వెంకటలక్ష్మి అధ్యక్షతన రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇబ్బంది పడుతున్న రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాల సమస్యలపై, భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి గంజి గంగాభవాని, ఉపసర్పంచి బేతపూడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వై.కిషోర్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాళ్ల : రైతులు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని డిప్యూటీ కలెక్టర్ కనుమూరు రఘు రామకృష్ణంరాజు కోరారు. కాళ్లలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సును భీమవరం ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సదస్సులో రైతుల నుంచి వస్తున్న వినతులపై తహశీల్దార్ సుందర్‌రాజ్‌ను అడిగి తెలుసుకున్నారు. సదస్సులో సర్పంచి బందా విజయ, ముత్యాలరత్నం, రైతులు పాల్గొన్నారు.

భీమవరం : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ద్వామా పిడి, రెవెన్యూ సదస్సుల మండల ప్రత్యేక అధికారి కెపిహెచ్ అప్పారావు అన్నారు. కుముదవల్లి

మొగల్తూరు : మండలంలోని శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో 46 మంది రైతులు వినతులు అందించారని తహశీల్దార్ కె.రాజకిషోర్ తెలిపారు. ప్రజల నుండి వచ్చిన వినతులను పరిశీలించి తొందర్లోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డిటి సంధ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరంలో..

నిత్యావసరాల ప్రత్యేక కౌంటర్లను కొనసాగించాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో బియ్యం, కందిపప్పు, వంటనూనె ప్రత్యేక కౌంటర్లను మరికొంత కాలం కొనసాగించాలని సంబంధిత శాఖాధికారులను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వర్తక సంఘాలు, కిరాణా వ్యాపారులతో బియ్యం, కందిపప్పు, వంటనూనె, మినపప్పు, ఉల్లిపాయలు, బహిరంగ మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. టమాటా, ఉల్లిపాయల ధరలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. నూనె ధర కూడా కొంతవరకు తగ్గిందన్నారు. తణుకు పట్టణంలో ప్రత్యేక కౌంటర్లో మినపప్పు కూడా

అధికారులతో మాట్లాడుతున్న జెసి

హోల్‌సేల్ ధరలకు అమ్మేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, డిఎస్ఒ ఎం.సరోజ, ఎఎస్ఒ ఎం.రవిశంకర్, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి కె.సునీల్‌కుమార్, సిపిఒ కంటిపూడి శ్రీనివాసరావు, రైతుబజార్ ఎస్టేట్ అధికారి పి.క్యాథ్, కిరాణా వర్తక సంఘాల యజమానులు పాల్గొన్నారు.

నేడు కొవ్వలి నరసాపురం రాక

ప్రజాశక్తి - నరసాపురం

టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి యతిరాజారామ్మోహన్‌నాయుడు శనివారం అమెరికా నుంచి నరసాపురం రానున్నారు. శుక్రవారం రాత్రికి ఆయన హైదరాబాద్ చేరుకుని నరసాపురం వస్తారని అనుచరులు తెలిపారు. ఈ నెలాఖరు వరకు ఆయన నరసాపురంలోనే ఉండనున్నారు. కూటమి కార్యక్రమాల్లో కొవ్వలి పాల్గొననున్నారు. ఇదే సమయంలో పార్టీ అధినేత చంద్రబాబుతోపాటు పలువురు నాయకులను కలవనున్నట్లు కొవ్వలి తెలిపారు.

కొత్త డిజైన్ల పట్ల ఆసక్తి అవసరం

ప్రజాశక్తి - నరసాపురం

మహిళలు మార్కెట్లో వస్తున్న కొత్త డిజైన్ల పట్ల ఆసక్తి పెంచుకోవాలని హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ దక్షిణాది రాష్ట్రాల సంచాలకులు కల్లకూరు నాగతులసి అన్నారు. శుక్రవారం ట్రేడ్ సెంటర్లో శిక్షణ పూర్తి చేసిన 30 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ఆన్‌లైన్ మార్కెటింగ్, ఎగ్జిబిషన్లలో పాల్గొని ఆర్డర్లు తెచ్చుకుని మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్రగౌతమ్, సుగుణరాజు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు ప్రాంతంలో అధికారుల బృందం పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని హిందు శ్మశానవాటిక సమీపంలో వశిష్ట గోదావరి తీరాన పురపాలక సంఘం నిర్వహిస్తున్న డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని శుక్రవారం చెన్నయ్‌కు చెందిన కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ డైరెక్టర్ హెచ్‌డి వరలక్ష్మి నేతృత్వంలో ఎపి పొల్యూషన్ బోర్డు ఇఇ కెవి.రావు, శాస్త్రవేత్త సౌమ్య, సుకృత బృందం పరిశీలించారు. డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో పొలాలు నివాసిత ప్రాంతాలు, చెరువులు, పంట కాల్వలను పరిశీలించారు. స్థానికులతో చర్చించారు. పంట కాలువ, గోదావరి నదీ ప్రాంతాల్లో నీటి శాంపిల్స్ సేకరించారు. డంపింగ్ యార్డ్ వివరాలను ఆర్‌డిఒ దాసి రాజు, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య నుంచి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డ్, పక్కన పొలాల్లో ప్రాంతంలో మట్టిని సైతం సేకరించారు. గాలిలో కాలుష్యాన్ని గుర్తించేందుకు పలు చోట్ల పరికరాలను అమర్చారు. రెండు రోజుల పాటు కాలుష్య

డంపింగ్ యార్డు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

శాతాన్ని గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బృందం పరిసర ప్రాంతాల్లోని స్కూళ్లు,నివాస ప్రాంతాలు ,పొలాలు ,చెరువులను పరిశీలించారు. శనివారం కూడా బృందం ఇదే ప్రాంతంలో పర్యటించనుంది. పట్టణంలో 30 ఏళ్లగా కంపోస్టు యార్డును గోదావరి తీరాన్నే నిర్వహిస్తున్నారు. దీనివల్ల నదీజలాలు కలుషితమవుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఐదేండ్ల పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త ఓసూరి దేవేంద్ర వణికర్ ఢిల్లీలోని నేషనల్ ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. దీన్ని కోర్టు సీరియస్‌గా తీసుకుంది. కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ డైరెక్టర్‌ను విచారించి నివేదికను అందించాలని ఆదేశించింది. దీంతో పాటు పొల్యూషన్ బోర్డు, క్వాలిటీ మేనేజ్మెంట్ అథారిటీని కూడా ఈ కమిటీలో నియమించింది. జనవరి 7వ తేదీలోగా నివేదికను అందించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో తొలిసారిగా కమిటీ నరసాపురం ప్రాంతాన్ని సందర్శించింది. పరిశీలనకు విచ్చేసిన అధికారులు ఏటిగట్టు ప్రాంతంలోని కంపోస్టుయార్డును పరిశీలించి ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికులు కూడా ఇబ్బందులను తెలపడంతో సమీపంలో ఉన్న స్కూల్, కాలేజీని పరిశీలించారు.

15న 23 రన్‌ను విజయవంతం చేయాలి

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఈ నెల 15న పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్లో చేపట్టనున్న 23 రన్‌ను విజయవంతం చేయాలని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పూలపల్లిలోని ఎలిమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన సేవ్ ద గర్ల్ చైల్డ్ 23 ట్రయల్ రన్ కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ రామానాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014 నుంచి సేవ్ ద గర్ల్ చైల్డ్ 23 రన్‌ను ప్రతి రెండేళ్లకోసారి ఉద్యమంలా నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని అన్ని విద్యాసంస్థల విద్యార్థులతో పాటు ప్రతి వార్డు, ప్రతి గ్రామం నుంచి వేలమంది జనం తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఐజిక్ సెక్రటరీ రత్నరాజు, నాయకులు జివి, కోడి విజయభాస్కర్, పితల శ్రీనివాస్, కడలి గోపి, కెవి.కృష్ణవర్మ, దీప్తి అప్పారావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - ఉండి

సంతృప్తి కేవలం అన్నదానంలోనే ఉంటుందని లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు అన్నారు. శుక్రవారం మహదేవపట్నం శివారు రామచంద్రపురంలోని సన్‌రైజ్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం దాత గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజును అభినందించారు. కార్యక్రమంలో గాగిత మహంకాళీ, పెన్మెత్స జగన్నాధరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, పెన్మెత్స రంగ ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యతని, ప్రతి శుక్రవారమూ డ్రైడే పాటిస్తూ దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధులను అరికడదామని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం పట్టణ ఆరోగ్య కేంద్రం (ఎన్‌టిఆర్ ఐంక్షన్) పరిధిలోని 9, 10, 11, 12వ వార్డుల్లో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజీన్‌లపై జరుగుతున్న అవగాహన కార్యక్రమాలను సహాయ మలేరియా అధికారి పి.శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శి టివిఎస్.లక్ష్మి, మేరీ, మంగతాయారు, పోశమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల్లో శనివారం జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ చేశామని తహశీల్దార్ కె.రాజకిషోర్ తెలిపారు. మొగల్తూరు, రామన్నపాలెం, కాళీపట్నం, జగన్నాధపురం, రెవెన్యూ పరిధిలోని నీటి సంఘాల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

ఉండి: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు ఉండి మండల ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రత్నకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏడు చోట్ల ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉండి, మహదేవపట్నం గ్రామాలకి సంబంధించి ఆయా గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ, యండగండి గ్రామంలోని జూనియర్ కళాశాలలోనూ, ఆరేడు కోలమూరు, చిలుకూరు, పాందువ్వ గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా పర్యవేక్షిస్తున్నట్లు రత్నకుమార్ తెలిపారు.

CHANGE OF NAME

I, MOHAMMAD KALISHA, S/o. Mohammad Azgar Ali, Resident of D.No.17-1-2,Lakshmivarapu peta, Revenue ward No.17, Eluru, Eluru Dist, A.P - 534005. I have changed my Name from MAHAMMAD KALESHA (Old name) To MOHAMMAD KALISHA (New name) for all practical purposes .

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఏలూరు వారి కోర్టులో, ఏలూరు జిల్లా.

E.P.47/2023
in O.S.365/2021

పిటీషన్ :
చెన్నం నాగమణి ...D.H.R
మరియు
దారం మధుబాబు వగైరా ...J.D.R
టు
దారం మధుబాబు, S/o.దేవదత్తం, R/o.D.No.6B-12-120, దక్షిణపు వీధి, జలాపరమేశ్వరి కాలనీ, ఏలూరు.

పై E.P లో 1వ JDR యొక్క హాజరు నిమిత్తం వాయిదా ది.6-1-2025వ తేదీన అయివున్నది. కావున 1వ JDR ది.6-1-2025వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట ప్రత్యక్షంగా గాని ప్లీడరు ద్వారా గాని హాజరు కావలెను. లేనిచో వారి పరోక్షంలో తీర్మానించబడును.

Eluru B.Srilakshmi, Advocate
Dt.13-12-2024 Eluru, Cell: 8019442114